సాక్షి
చిత్తూరు
శనివారం । 2 । మార్చి । 2024



ఉపాధి పనులపై అవగాహన

ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య పథక సంచాలకుడు ఆదేశించారు. - IIలో



హార్స్ షో అదుర్స్!

పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హార్స్ షో నిర్వహించారు. - IIలో



రికార్డుల పరిశీలన

గుడిపాల మండలంలోని ఉపాధి కార్యాలయంలో శుక్రవారం డ్వామా పీడీ రికార్డులు పరిశీలించారు. - IIలో

న్యూస్‌రీల్

చీడపీడల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె ఆర్‌బీకేలో శుక్రవారం చిత్తూరు ఆత్మ ఆధ్వర్యంలో స్కిల్ ట్రైనింగ్ ఆఫ్ రూరల్ యూత్ (ఎస్‌టీఆర్‌వై) ద్వారా పంటలను ఆశించే చీడపీడల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చీడపీడలు నివారణకు వ్యవసాయాధికారుల సూచన మేరకు తగిన మోతాదులో రసాయన ఎరువులు, మందులు వినియోగించాలని తెలిపారు. సేంద్రియ విధానాలపై దృష్టి సారించాలని సూచించారు. సలహాలు అవసరమైన రైతులు 155251 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులతో పాటు పురుగు మందులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు డీడీ ద్వారా నగదు చెల్లిస్తే రెండు, మూడు రోజుల్లో సరఫరా చేస్తారని వెల్లడించారు. ఈ క్రమంలోనే చీడపీడల నివారణ తీసుకోవాల్సిన సమగ్ర సస్యరణ చర్యలపై ఆత్మ డీపీడీ రత్నప్రసాద్, ఏడీఏ లక్ష్మీదేవి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో భక్తులు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష కుంకుమార్చన శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట గణపతి హోమం, చండీ హోమం జరిపించి పూర్ణాహుతి, మంగళహారతి సమర్పించారు. అనంతరం చేపట్టిన కుంకుమార్చనలో మొత్తం 167 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయం తరఫున పూజా సామగ్రి అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి చేతులమీదుగా దంపతులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజేష్, రామ్‌దాస్, భారతి, బుజ్జమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హైమావతి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఆస్పత్రి సేవలు



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: జిల్లా ఆస్పత్రిలో చేపట్టే ప్రతి సేవను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ఆస్పత్రిలో జరిగే సర్జరీలు, ప్రసవాలు, ఇతర సేవల వివరాలతో ఇకపై పక్కాగా నివేదికలు తయారు చేయాలన్నారు. వాటిని నెల వారీగా ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఈ మేరకే ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. అందుకోసం ఆస్పత్రికలో సేవల పరిధి పెంచాలని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు జార్జ్, ప్రసాద్ పాల్గొన్నారు.


నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి



మాట్లాడుతున్న షణ్ముఖశివన్

చిత్తూరు రూరల్: పంచాయతీల్లో చేపట్టే ప్రతి పనిలోనూ నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని బ్యూరో స్టాండర్డ్ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ షణ్ముఖ శివన్, డీపీఆర్‌సీ జిల్లా కో–ఆర్డినేటర్ షణ్ముఖ రామ్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో పాటించాల్సిన నాణ్యతాప్రమాణాలపై అవగాహన కల్పించారు. అలాగే కార్యాలయాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

లబ్ధిదారులకు మెగా చెక్ అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, మేయర్ అముద



"పేద బిడ్డల ఉన్నత చదువులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది.. జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది.. త్రైమాసికం వారీగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది" అని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యాదీవెన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విశిష్ట పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమంగా రాణించాలని పిలుపునిచ్చారు.

ఉన్నత విద్యకు దీవెన

- పేద విద్యార్థుల చదువుకు సాయం
- జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల
- 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.54 కోట్లు
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం
- పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నిరుపేద తల్లిదండ్రులకు తమ పిల్లల ఉన్నత చదువు భారం కాకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకం అమలు చేస్తోందని ఎంపీ రెడ్డెప్ప వెల్లడించారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యాదీవెన నగదు విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి ఎంపీతోపాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ టీడీపీ పాలనలో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగానే ఉండేదని విమర్శించారు.ఉన్నత చదువులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిక పేద పిల్లలకు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందన్నారు. జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేది కాదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని చెప్పారు. ఏటా త్రైమాసికం వారీగా ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులనునేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందని తెలిపారు. దీంతో పిల్లలు సంతోషంగా చదువుకుంటున్నారని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి గాను ప్రభుత్వం విద్యాదీవెన నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలో 32,427 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందన్నారు. 29,407 మంది తల్లుల ఖాతాలలో రూ.20,54,29,471 నగదు జమ చేసినట్లు వివరించారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అయ్యే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును వారం, పది రోజుల్లో సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అనంతరం జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, డీఆర్‌ఓ పుల్లయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీబాషా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

జగనన్న పేరు నిలబెడతా



మా తల్లిదండ్రులు నన్ను ఉన్నత విద్యను చదివించలేని పరిస్థితి. నేను ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నా. మాది పేద కుటుంబం. తండ్రి నా చిన్నతనంలో మృతి చెందారు. అమ్మే నన్ను చదివిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన నా కుటుంబానికి ముఖ్యమంత్రి జగనన్న చాలా మేలు చేస్తున్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ఫీజురీయింబర్స్‌మెంట్ నా చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. బాగా చదివి జగనన్న పేరు నిలబెడుతా.

– నందిని, డిగ్రీ విద్యార్థిని, వి.కోట

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నాలాంటి పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన పథకాన్ని ఏటా అందుకుంటున్నా. నేను పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. మాది మధ్యతరగతి కుటుంబం. నేను ఉన్నత విద్య చదవాలంటే మొదట్లో తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ప్రభుత్వం అందజేస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన పథకం లబ్ధితో నేను సంతోషంగా డిగ్రీ చదువుకుంటున్నా. మామేలు కోసం ఇంతలా ఆలోచిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– కృష్ణ, డిగ్రీ విద్యార్థి, కుప్పం

సకాలంలో అందిస్తున్నారు



గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేది కాదు. డిగ్రీ చదవాలంటే తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. మాలాంటి పేద విద్యార్థులకు సకాలంలో విద్యాదీవెన, వసతి దీవెన నగదు అందిస్తున్నారు.

– కాంచన, డిగ్రీ విద్యార్థిని, కుప్పం

తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 16,139 మంది విద్యార్థుల హాజరు



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌లకు తావు లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. మొత్తం 17,036 మంది విద్యార్థులకు గాను 16,139 మంది హాజరయ్యారు. 897 మంది గైర్హాజరయ్యారు. సకాలంలో రావాలని అధికారులు చేసిన సూచనలతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పిల్లల సౌకర్యార్థం ఆర్టీసీ అదనపు బస్సులు నడిపింది. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఆయా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

వెబ్‌కాస్టింగ్‌లో పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో పరీక్షల తీరును పరిశీలించేందుకు ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న డీవీఈఓ కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా పర్యవేక్షించారు.

'ఆదర్శ'లో అడ్మిషన్‌కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో ఆరో తరగతి అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ దేవరాజు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి www. apms. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన ఆయా మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఎస్పీ జాషువా

చిత్తూరు కలెక్టరేట్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు విస్తృత స్థాయి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడే నగదు, ఇతర వస్తువులను సీజ్ చేయడంపై అవగాహన పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్పీ జాషువా పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరులోని క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఫారమ్ 6,7,8 పరిష్కారం, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీని చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లోడీఆర్‌ఓ పుల్లయ్య, ఎన్నికల విభాగం సిబ్బంది ఉమాపతి, మనోజ్ పాల్గొన్నారు.

బురిడీ బాబుకు రెస్ట్ అవసరం



లబ్ధిదారులకు మెగా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : ఎన్నికల సమయంలో హామీలు గుప్పిస్తూ ప్రజలను బురిడీ కొట్టించాలని యత్నించే చంద్రబాబుకు ఇక రెస్ట్ అవసరమని, ఆ మేరకు జనం ఓట్ల ద్వారా తీర్పునివ్వాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మొరం గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 652 ఎస్‌హెచ్‌జీలకు రూ.5.36 కోట్ల మెగా చెక్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో బ్యాంకుల్లోని నగలు మీ బీరువాల్లోకి వస్తాయని ఊకదంపుడు హామీలు ఇచ్చిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో మహిళలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రుణమాఫీ పేరిట రైతులను ముంచారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాగానే ఉత్తిత్తి హామీల చిట్టా విప్పుతున్నారని ఆరోపించారు. నాటి చంద్రబాబు పాలనకు, నేటి జగనన్న సుపరిపాలనకు తేడా తెలియాలంటే ఒక్కసారి బ్యాంకు పాసుపుస్తకాలు చూస్తే చాలని చెప్పారు. అందులో లావాదేవీలను పరిశీలిస్తే ప్రభుత్వం ఎంత మేలు చేసిందో అర్థమవుతుందని వెల్లడించారు. మంచికి, చెడుకు జరిగే ఈ పోరులో ఎవరి పక్షాన నిలవాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. కేవలం ఓట్ల కోసమే వచ్చే టీడీపీ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని స్పష్టం చేశారు. బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ పలమనేరులో టీడీపీని బతికించిన తననే చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగనన్నకు ప్రజలే మొత్తం 175 స్థానాలు కట్టబెడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ రోజా, పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సచివాలయాల మండల కన్వీనర్ తిరుమల, వైస్ ఎంపీపీ గజేంద్ర, మనోజ్‌రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షులు కృష్ణవేణి, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రజలకు శ్రీరామరక్ష



పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్షని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్‌పురంలో రూ.20 లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం, వీవీపురంలో రూ.కోటితో నిర్మించిన సచివాలయ, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని, పేదల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక ఎల్లోమీడియా సహకారంతో ప్రతిపక్షాలు బురదజల్లుతున్నాయని విమర్శించారు. ఒకప్పుడు ఏ పథకం కావాలన్నా అభివద్ధి పనులు జరగాలన్నా మండల కేంద్రంలోని పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆయా గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రతి సమస్య పరిష్కారమవుతోందని వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీవీపురం వచ్చినప్పుడు గ్రామస్తుల ఆకాంక్ష మేరకు రోడ్డు వేయించామని తెలిపారు. ఇప్పటి వరకు ఎస్ఆర్‌పురం మండలంలో రూ.39 కోట్లతో రోడ్లు నిర్మించినట్లు వివరించారు. అలాగే కుశస్థలీ నదిపై రూ.29 కోట్లతో వంతెన, రూ.10లక్షల చొప్పున వెచ్చించి 54 ఆలయాలు, రూ.9కోట్లతో రోడ్లకు మరమ్మతులు నిర్మించామని తెలిపారు. తాగునీటి సరఫరా కోసం 30 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. ఒక్క ఎస్ఆర్‌పురం మండలంలోనే ఇన్ని అభివృద్ధి పనులను పారదర్శకంగా పూర్తి చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా తన కుమార్తె కృపాలక్ష్మిని అధిష్టానం నియమించిందని, ఆమెను ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే లక్ష్యంగా కృపాలక్ష్మి రాజకీయాల్లోకి వచ్చిందని, అవినీతి మరక అంటకుండా నిజాయితీగా పనిచేయాలని సూచించానని తెలిపారు. అనంతరం అర్హులకు జగనన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, పెనుమూరు ఏఎంసీ అధ్యక్షుడు బండి కమలకర్‌రెడ్డి, సర్పంచ్‌లు హరిత, లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యులు శివయ్య, ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, పార్టీ మండల మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, తహసీల్దార్ అల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఓ కృష్ణయ్య, వైద్యులు బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, నాయకులు కుప్పయ్య, దామునాయుడు, డిసెంబర్‌శెట్టి, జనార్ధన్ పాల్గొన్నారు.



చెక్ అందుకున్న లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కార్వేటినగరం : అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.15.20లక్షల చెక్కులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి పంపిణీ చేశారు. శుక్రవారం పుత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ ఓ వరమని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 5 వతరగతిలో అడ్మిషన్, 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌లకు ఏపీఆర్‌జేసీ, డిగ్రీలో ప్రవేశానికి ఏపీఆర్‌డీసీ సెట్ జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు www. aprs. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

చిత్తూరు కలెక్టరేట్ : రాబోయే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొత్తం 1,762 పోలింగ్ కేంద్రాలకు గాను 415 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆవులపబ్బం.. అంగరంగ వైభవం



చౌడేపల్లె మండలం పరికిదొనలో రెండు రోజులుగా నిర్వహించిన ఆవులపబ్బం శుక్రవారంతో ముగిసింది. గడ్డంవారిపల్లె, పరికిదొన, ఆమినిగుంట పంచాయతీల్లోని పన్నెండు గ్రామాలకు చెందిన మహిళలు ఉదయమే పిండి దీవెలు, నెయ్యిదీపాలతో ఊరేగింపుగా మేళతాళాల నడుమ కాటమరాజుల ఆలయానికి చేరుకున్నారు. భక్తి శ్రద్ధలతో కాటమరాజు , నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆవులపబ్బం సందర్భంగా పరికిదొన భక్తులతో కిక్కిరిసింది. – చౌడేపల్లె

మందుబాబు హల్‌చల్

గంగవరం : మండలంలోని పత్తికొండ గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి హల్‌చల్ చేశాడు. ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో కొందరి ఇళ్లలోకి ప్రవేశించడంతోపాటు వింత చేష్టలు చేయడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు. అనంతరం హైవే మొబైల్ పోలీసులకు అప్పగించారు. అనుమానితుడు మద్యం సేవించడంతోపాటు మతిస్థిమితం లేదని పోలీసులు గుర్తించి వదలిపెట్టారు.

హార్స్ షో అదుర్స్!




పుత్తూరులోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రవీణ, చిట్టేష్‌రావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హార్స్ షో అలరించింది. హార్స్ జంపింగ్, టెంట్ పెగ్గింగ్ ఈక్వెస్ట్రియన్ ప్రదర్శన ఆకట్టుకుంది. అంతర్జాతీయ మిల్లెట్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. అనంతరం కళాశాలలో తిరుపతి స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థిలోకం 52 యూనిట్ల రక్తం దానం చేసింది. దాతలకు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది. - పుత్తూరు

ప్రేమోన్మాది ఘాతుకం




ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధిత యువతి, ప్రేమోన్మాది మహేష్

చంద్రగిరి: తన ప్రేమను అంగీకరించకపోవడంతో ఓ ప్రేమోన్మాది రెచ్చిపోయాడు. అర్ధరాత్రి సమయంలో యువతి ఇంట్లోకి ప్రవేశించి కత్తితో దాడికి పాల్పడి ఆమెను తీవ్రంగా గాయపరిచిన ఘటన చంద్రగిరిలో కలకలం రేపింది. కుటుంబ సభ్యుల కథనం.. చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డుకు చెందిన యువతి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆమె అమ్మమ్మ మంగమ్మ చిన్నప్పటి నుంచి యువతిని పెంచి పోషించింది. నర్సింగ్ పూర్తిచేసుకున్న యువతి ఏడాది క్రితం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సింగ్ శిక్షణ తీసుకుంటోంది. ఈ క్రమంలో తన పక్కింట్లో అద్దెకుంటున్న కృష్ణయ్య కుమారుడు పిడతల మహేష్ యువతికి పరిచయమయ్యాడు. కొన్నాళ్లు ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. తర్వాత మహేష్ చెడువ్యసనాలు తెలుసుకున్న యువతి అతని నుంచి దూరమైంది. అప్పటి నుంచి మహేష్ యువతిపై కక్ష పెంచుకున్నాడు. తరచూ వేధింపులకు పాల్పడేవాడు. అయితే వారికి మగదిక్కు లేకపోవడంతో ఏంచేసినా మిన్నకుండిపోయేవారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

నెలన్నర క్రితం యువతి ఇంట్లోకి అక్రమంగా చొరబడిన ప్రేమోన్మాది మహేష్, యువతితో పాటు ఆమె అమ్మమ్మపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. స్థానికులు యువకుడిని అడ్డుకున్నారు. ఆపై యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రక్షణ లేకపోవడంతో పది రోజుల క్రితం యువతి పెద్దమ్మ వచ్చి ఆమెను చెన్నైకి తీసుకెళ్లింది.

అద్దె ఇల్లు ఖాళీ చేసేందుకు రావడంతో..

యువతి చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డులో ఉంటున్న అద్దె ఇల్లును ఖాళీ చేసేందుకు గురువారం రాత్రి తన పెద్దమ్మతో కలిసి చెన్నై నుంచి చంద్రగిరికి చేరుకుంది. విషయం తెలుసుకున్న మహేష్ అర్ధరాత్రి సమయంలో కత్తి తీసుకుని యువతి ఇంట్లోకి ప్రవేశించాడు. తర్వాత యువతిపై కత్తితో దాడిచేశాడు. ఆమె ఛాతి, ఎడమ చేతిపై దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో కత్తిని అక్కడ పడేసి ప్రేమోన్మాది మహేష్ పారిపోయాడు. అనంతరం స్థానికులు అక్కడకు చేరుకుని, యువతిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు రుయా ఆస్పత్రికి చేరుకుని దాడికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం దాడికి పాల్పడిన ప్రేమోన్మాది మహేష్ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలకు 2023–24 ఏడాదికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు వచ్చినట్లు డీపీఓ లక్ష్మి శుక్రవారం తెలిపారు. అన్‌టైడ్ కింద రూ.11.69 కోట్లు, టైడ్ కింద రూ.17.55 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

వి.కోట: పట్టణంలోని భారత్‌నగర్‌లో శుక్రవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు..బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లె పంచాయతీ చంద్రిమాకులపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు మణి(20), రామసముద్రానికి చెందిన సిద్దమ్మను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. గతంలో వేరే అమ్మాయిని ప్రేమించిన మణి, ఆమెను రెండో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీనిపై భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి ఘర్షణ జరగడంతో మనస్తాపం చెందిన మణి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

మెడికల్ షాపులో చోరీ



చోరీ జరిగిన దుకాణం

పుత్తూరు: స్థానిక గేట్‌పుత్తూరు కేబిన్ సమీపంలోని శ్రీసత్య మెడికల్ షాపులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారు జామున షాపు తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే యజమాని ఓంకార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఓంకార్ వచ్చి చూడగా క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.50 వేలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరకుతోట దగ్ధం



కాలిపోయిన చెరుకుతోట

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్టుసర్క్యూట్ కారణంగా ఆదర్శరైతు జగదీష్‌రెడ్డికి చెందిన చెరకుతోట దగ్ధమైంది. తోటలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. సుమారు అర ఎకరాలోని పంట ఆహుతైందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని కోరాడు.

కాలిపోయిన మామిడితోట



అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు

గంగవరం: మండలంలోని గోవిందశెట్టిపల్లెలో తాజుద్దీన్ అనే రైతుకు చెందిన మామిడి తోటను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చేసిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. మందులు పిచికారీ చేసేందుకు తోటకు వెళ్లిన రైతు ఈ విషయం గుర్తించి కన్నీటిపర్యంతమయ్యాడు. పూత దశలోనే చెట్లకు నిప్పు పెట్టారని, సుమారు 150 చెట్లు పూర్తిగా కాలిపోయాయని వెల్లడించాడు. ఐదెకరా తోట నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఆటో డ్రైవర్‌పై దాడి: కేసు నమోదు

పెనుమూరు(కార్వేటినగరం) : ఆటో డ్రైవర్‌పై యువకులు దాడి చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పెనుమూరు ఏఎస్ ఐ ఉమా మహేశ్వర్ కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని 5వ డివిజన్ రఘురాం కాలనీకి చెందిన కిరణ్‌రాయల్ గురువారం పెనుమూరు మండలానికి తన ఆటోలో వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఉగ్రాణపల్లె వద్ద నలుగురు యువకులు ద్విచక్రవాహనాలను రోడ్డుపక్కన నిలిపి ఉన్నారు. వేగంగా వస్తున్న ఆటో నుంచి దుమ్ము వాహనాలపై పడిందని ఘర్షణకు దిగారు. కిరణ్‌రాయల్ తలపై గాయపరిచారు. బాధితుడు చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఘటన పెనుమూరు పరిధిలో జరగడంతో కేసును పెనుమూరు పీఎస్‌కు రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రికార్డుల పరిశీలన

గుడిపాల: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో శుక్రవారం డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజశేఖర్ రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్క రికార్డు సక్రమంగా నిర్వహించి, వాటన్నింటినీ ఆడిట్ సమయంలో చూపించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న పనులు, కూలీల సంఖ్య తదితర విషయాలపై ఆయన ఆరా తీశారు. అనంతరం బసవాపల్లె ఫారెస్ట్‌లో క్యాటిల్ పాండ్ వర్క్‌ను ఆయన పరిశీలించారు.

4న కాణిపాకంలో పలు ప్రారంభోత్సవాలు



మాట్లాడుతున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 4వ తేదీన పలు భవనాలకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సుమారు రూ.60 కోట్లతో నిర్మించిన పలు భవనాలను సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మంత్రులు మంత్రి కొట్టు సత్యనారాయణ, నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కలెక్టర్ షణ్మోహన్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే వరసిద్ధుని ఆలయంలో రూ.8.5 కోట్లతో బంగారుతాపడం పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే రూ.3.5 కోట్లతో మూషిక మండపంలో వెండి వాకిలికి సిద్ధం చేసినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అర్చకుడు శేఖర్ గురుకుల్ పాల్గొన్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ వెంకటశివ

పాలసముద్రం : ఎన్నికల విధులను బీఎల్‌ఓలు బాధ్యతగా నిర్వర్తించాలని ఐటీసీఎల్ డిప్యూటి కలెక్టర్ (ఈఆర్‌ఓ) వెంకటశివ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దులోని మండలాల్లో కొత్త ఓటర్ల నమోదును నిశితంగా పరిశీలించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌లపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సుబ్బులక్ష్మి, డిప్యూటి తహసీల్దార్ మధుబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన



రికార్డులు పరిశీలిస్తున్న రాజశేఖర్

యాదమరి : మండలంలోని 14 కండ్రిగలో గ్రామస్తులు, రైతులకు ఉపాధి పనులపై శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డులు ఉన్నవారందరూ పని చేసుకోవాలని కోరారు. ఉపాధి కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం రైతులు తమ పొలాల్లో నూతనంగా తవ్విన ఫారంఫాండ్‌లను పరిశీలించారు. ఫాండ్ వల్ల వర్షపు నీరు నిల్వ చేరి వ్యవసాయబోర్లకు ఉపయోగపడుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, ఈసీ రమ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 373 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపల్ తదితరులు

పలమనేరు : పట్టణంలోని శ్రీవర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా చేపట్టిన మేళాలో19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 557మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. వీరిలో 373 మందికి కంపెనీల ప్రతినిధులు ఉద్యోగావకాశం కల్పించారు. ఉద్యోగాన్ని బట్టి వార్షిక వేతనంగా రూ.1.8లక్షల నుంచి రూ.4.2లక్షల దాకా ఉంటుందని కంపెనీ హెచ్‌ఆర్‌లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం అభినందించారు.

సీసీ కెమెరాల వైర్లు కట్ చేయడంపై ఫిర్యాదు



కళాశాలలో పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటకృష్ణ

కార్వేటినగరం : ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను గుర్తుతెలియని దుండగులు కట్ చేసినట్లు ప్రిన్సిపల్ స్వరూప శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటకృష్ణ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ దుండగులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామన్నారు. ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగాధర నెల్లూరు : మండలంలోని పెద్ద కాలువ పంచాయతీ చెర్లోపల్లె వద్ద ఈనెల 26వ తేదీ రాత్రి జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవరాం ఈ మేరకు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. బెంగళూరుకు చెందిన మురుగన్ (47), నాగరాజు, బాలాజీ స్నేహితులని తెలిపారు. నాగరాజు వద్ద మురుగన్ అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించమని అడిగే క్రమంలో అసభ్యంగా దూషించాడన్నారు. దీంతో కక్ష పెంచుకున్న నాగరాజు ఎలాగైనా మురుగన్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడని చెప్పారు. ఇందుకు బాలాజీ సహాయం తీసుకుని ఘటనాస్థలానికి మురుగన్ తీసుకువచ్చాడన్నారు. ముగ్గురూ కలిసి మద్యం తాగి, మత్తులో ఉన్న మురుగన్ తలపై సుత్తితో కొట్టి హత్యచేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నాగరాజు, బాలాజీని చెన్నై–బెంగళూరు హైవే పక్కన బాలా త్రిపుర సుందరి కల్యాణమండపం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన సీఐలు శంకర్, కుళ్లాయప్ప, ఎస్‌ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుబ్బమ్మతోపాటు ఐడీ పార్టీ సిబ్బంది సుధాకర్, రాజ్‌కుమార్‌ను అభినందించారు.

హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.

మంచి అలవాట్లు మెరుగైన ఆరోగ్యం



మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయులని, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరినైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి, ఇవి ఆరోగ్యకరమైనవి.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి చురుకుగా యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒకవేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి.అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20-30 సార్లు నమలాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్ గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కర లేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు, తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...



➡ వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది ➡ పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే ➡ మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయులను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది ➡ ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు ➡ బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి ➡ మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?



● అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

''కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు'' అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. ''సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేదు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం'' అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటి వరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.



● డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్



● తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. ''ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది

- రాజేంద్ర ప్రసాద్



● ఆయూషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో..'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను'' అన్నారు. ''మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు'' అన్నారు విశ్వ కార్తికేయ. ''మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు రమాకాంత్ రెడ్డి. ''మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం'' అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. ''సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు'' అన్నారు దర్శకుడు నీలకంఠ.

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్



● కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. ''అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.